# "పసువుల గాల్చేటి ఈరమల్లయ్య"

పసువుల డాకుటరని పిలువబడే ఈరమల్లయ్యేం సదువుకోలేదు. అయితే పసువులకే రోగాలచ్చినా, నొప్పులచ్చినా వైద్యం జేత్తడు. ముప్పయ్యారు దేవుళ్ళకు ముందు పొచమ్మన్నట్టు, ముప్పయ్యారు రోగాలకు మందు సురుకువెట్టుడంటడీరమల్లు. గొడ్లు మంచిగలెవ్వని పిలిత్తె పొయ్యి సూత్తడు. పిడుకలు తంపి పెట్టిత్తడు. అంల్ల కొనుపులు పెట్టి ఎఱ్ఱగయినంక తీసి సురుకువెడుతడు. అదేం మాయో కాని పసురాలకచ్చేటి సానరోగాలు ఈరమల్లయ్య పెట్టే సురుకుతోని మాయమయిపోతయి. గట్లనే గొర్లు మ్యాకలకు గూడ సురుకువైద్యం జేత్తడీరమల్లు. పొల్లగండ్లకు కడుపుగిట్టనొత్తె బొడ్డు గాలుత్తడు. అందుకే ఈరమల్లయ్యను సురుకుల ఈరమల్లయ్యంటరు. పసురాల గాల్చేటీరమల్లయ్యంటరు.

ఇంక పచ్చి జీడి పెట్టుడు, ఓమ పోసుడసొంటి వైద్యం గూడ సేత్తడీరమల్లు. తనకు మోకాల్లు లేవనీయకుంటయితె మోకాల్లమీన కాల్చుకున్నడు. ఒంటినాగెలవుసంతోని గీ సురుకుల వైద్యంతోని బతికే ఈరమల్లును పసురాల కాల్తడని కటికోడంటరు. ఇంతింత పెద్ద మీసాలు తలుకాయమీన పెద్ద రుమాలుతోని బూచోనోలుంటడీరమల్లు. చిన్నపిల్లగండ్లేడిత్తె ఈరమల్లును పిల్సి సురుకు వెట్టిత్తనని అవ్వయ్యలు బెదిరిత్తరు. పిల్లలయినెంజూత్తె బయపడుతరు గూడ........

ఈరమల్లు వడ్లపేర్లు, ఎడ్లపేర్లు బాగంటయి తెలువదంటడు. అయినె ఈడచ్చిన కొల్లాగెలకు ఎద్దేత్తడు. కోల్లాగె నాలుగు కాల్లు కట్టేసి రోకలిబండతోని సితుకబోడిసేదో పసరు రాత్తడు. గది సూత్తె బయమనిపిత్తది. ఎడ్ల గాల్చేటప్పుడు, ఎద్దేసేటప్పుడు ఈరమల్లు ఎమునోలె గనిపిత్తడు. ఓనాడు ఈరమల్లు కోల్లాగే చచ్చిపెయింది. బజాట్ల చచ్చిపడున్న కోల్లాగెమీనబడి గొడగొడేడ్తండు ఈరమల్లు. కండ్లనీల్లు బుఱ్ఱమీసాలను తడిపేత్తన్నయి. కన్నకొడుకే సచ్చిపెయినట్టు భోరుభోరునేడుత్తున్న ఈరమల్లయ్య ఎవ్వలూకుంచినా ఊకుంటలేడు.

"నాగటిమీనెద్దువాయె. ఇప్పుడెట్లెల్లాలె. దేవుడా! నీమీన మన్నువొయ్య! నన్నన్న కొంచవోకపోతివి!' అని కనవడని దేవునిమీన మన్నువోసుకుంటేడుత్తండు.

"ఈరమల్లు సిన్నకొడుకు చెలుకలెడ్లు మేపుతండట. చెలుకపక్కనే పజ్జొన్న సేనుందట. కోల్లాగె గండ్ల కురికిందట. పొల్లగాడురికెవారికె జపకు బరుకున ఐదారు బుక్కలు మేసిందట. జానడెత్తున్న

పజ్జొన్న మొక్కలు ఇసంమీదున్నయి. కొల్లాగెకు నామచ్చింది. నురుగులు గక్కింది. ఇంటికి గొట్టుకచ్చెవారకు బజార్లనే పడి సచ్చిపెయింది". ఎద్దు చావు గురించి చెప్పుకుంటండ్రక్కడున్నోల్లు.

కంట్లె నీటిసుక్క గూడ ఉండదనుకున్న ఈరమల్లు గంతేడ్సుడు సూసి నేను పరేషానయిన. గా యెద్దెంత జీవనాదారమొ, పసువులమీదాయినకెంత ప్రేమో నాకు సముజయింది. అయినె నూకుంచుటానికి సానమంది కోశిశో[84] సేత్తండ్రు.

"ఆయుష్షు గూడినంంకోటుంటాదె. ఎమదరుమరాజు పిలుత్తె ఎవ్వలయిన పోవుడే. పసువులయితేంది? మనుషులయితేది?"

గిది జరిగి సానేండ్లే అయింది. అప్పటికే ఈరమల్లుకు సాతగాకుంటయితంది. అటెనుక ఎవుసం జేసుడు బందుజేసిండు. కొడుకులే గది సూసుకుంటండ్రు. ఉన్న బూమిని నల్గురు కొడుకులకు పంచిచ్చిండు. కొన్నొద్దులు చెలుకల కావలున్నడు. అది గూడ సాతగాకుంటయింది. మెల్లెమెల్లెగ కుంటుకుంట నడ్సుకుంట పొయ్యి పసురాలగాల్చే వైద్యం మాత్తురం సేత్తరంగీరమల్లు. ఓసారి ఊరికిపోయినప్పుడు సూత్తే పురాగ సాతగాకుంటున్న డీరమల్లు. మొకాల్లు లేవనిత్తలెవ్వట. ముగ్గురు కొడుకులెవ్వరు బువ్వ పెడుతలేరట. ముసలోన్ని సాదుటానికేడ్తండ్రట. ఇగ పెద్ద మనుషుల్ల పడ్డరు. గా పంచాయిజ్జొద్దామని మూడు బజార్లకాడికి పొయ్యేవారకందరు జమయ్యున్నరు. సంగతేందో సెప్పుమని ఎద్దోన్నడిగిండ్రు పెద్ద మనుషులు.

పెద్దోడందర్ని తేరిపార జూసి పెద్ద మనుషుల్తోనన్నడు.

"మీకు తెలవందేముంది బాంచెను. చిన్నోల్లు అయ్యను గురించి పట్టించుకుంటలేరు. నేనొక్కన్నే సాదన్నా సెప్పుండ్రి. సొత్తామన్నా నాకేముంది? తండ్రన్నప్పుడు అందరు సమానంగ జూసుకోవాలె గద".

"మీరేమంటర్రా?" చిన్నోల్లనడిగిండొగయినె.

ఏమనేదేముంది పటేల? నాయిన్న పెద్దన్న దగ్గెర్నే ఉంటడు. మేం నెలకింతని అన్నకే ఇత్తం. అయినె కక్కడుండుడే ఇట్టం" అన్నరాల్లు.

తమ్ములమీదికి గంయ్‌మని లేచిండు పెద్దయినె.

"ఇగీల్లు పైసలిత్తె నేను ముల్లెగట్టుకుంట. గీల్ల మాటలు నమ్మకుండ్రి. గిసోంటి పంచాయితులు రొండుమట్లయినయి.[85] మందిల్నేమొ ఇత్తమంటరు. అటెనుక ఎప్పటిసిప్పెనుగులకే అన్నట్టయితది. నేనొక్కన్నే ఎందుకు సాదాలె? సాతగాకుంటయిన ముసలోనెంబడి ఎప్పటికో

మనిషుండాలె. పని జేసుకొని బతికే మాకెల్లది. నా ఒక్కని దగ్గర్నే ఉంచుతె ఎట్ల సెప్పుంర్రి? ఆల్లు దుబ్బ గూడియ్యరు" అన్నడు.

చిన్నోల్లదిక్కు కోపంగ జూసింర్రు పెద్ద మనుషులు. "దొంగ గాడ్దికొడుకుల్లార! మీకు నాయిన్న బరువైతన్నాడుర? ముసలోడు మిమ్ముల సాది, పెంచలేదార? ఉన్నకాడికి భూమిందీసుకొని గిట్ల జేత్తార? థూ...! మీ యవ్వ! అయ్యంజాదుటానికేడుత్తంర్రు" అని తిట్టింర్రు.

అటెనుక బాగసేసే తర్జన భర్జనలైనయి.

"ఏటేల మాకయ్యను సాదన్నని లేదనుకుంట్రంర్రా? కని ఎల్లకనే బాంచెను గీ తిప్పలన్ని. ఇన్రోజులు మేం నాయిన్నకు సరిగ్గ బత్తెమియ్యని మాట నిజమే. ఇగిత్తం. నాయిన్ననక్కన్నే ఉండనియ్యంర్రి" అన్నడు నడిపోడు.

పెద్దోడొప్పుకోలే. అందరు గలిసొ నిర్ణయానికచ్చింర్రు. తండ్రిని అన్నదమ్ములంత మనిషికో నెలుంచుకోవాలె. పెద్ద మనుషులు సెప్పిందాని కొప్పుకున్నరాల్లు. ముందుగాలెవ్వలింట్లుండాలె అన్నదానిమీద గూడ సాంచేపే బైసయింది. ఆఖరుకు చిట్టీలేసింర్రు. చిన్నోన్నుంచి మొదలు. అటెనుక మాడోడు, అటెనుక రొండోడు, ఆఖరుకు పెద్దోడు. గిట్ల దెగింది పంచాయితి.

కని వెళ్ళకనో ముసలోడని పరువజేయకనో ఆడోల్ల ప్రతాపంతోనో ముసలోన్ని ఒక్కలు గూడ చక్కగ చూడలేదని తెల్సింది. ఏడింంద్ల పల్లికూనోలె నెలకో ఇల్లు తిరుక్కుంట గునిపండ్లు పడుకుంట కుక్కల వడి పెట్టింది తింటండీరమల్లు. అందరికి యెమదరుమరాజోలె కనిపిచ్చేటీరమల్లు జెప్పిన యెముడచ్చి కొంచపోతె మంచిగుండని బాదపడ్తండని తెల్సింది.

అటెనుకయినె చచ్చిపెయిండు. అందరు ముసలోల్ల సంగతి గట్లనే ఉందని చెప్పగని ఈరమల్లసోంటి ముసలోల్లెంతోమంది కనవడ్తుంటరు. కొడుకులను ఓళ్ళె వెట్టుకొని కంటికి రెప్పోలె సాది సవరచ్చిన జేత్తె కొడుకుకేం జేత్తంర్రు. రెక్కలచ్చిన పక్షులోలె ముసలోల్ల గతికి ముసలోల్ల నిడ్సిపెట్టి సెంగోబిల్లనుడు కండ్లవడుతనే ఉంది. ఆర్థికంగెల్లక కొందరు జేత్తంటె ఎల్లి ముసలోల్ల బారమని కొందరు జేత్తంర్రు. గిదెక్కువ సదువుకున్నోల్లండ్లనే కనవడ్తది. ఇగ కొందరు ముసలోల్లెమొ కొడుకులమీద పలపచ్చం జూపి కొందర్ని బదునాం జేత్తంర్రు. ఏదేమైన రోజురోజుకీ సమాజంల ముసలోల్లకు భద్రతనేది లేకుంటైతంది. ఈరమల్లు యాదికచ్చినప్పుడల్ల నాకు ముసలోల్లకు అన్ని తీర్ల భద్రతదెత్తె మంచిగుండుననినిత్తది.

★ ★ ★